క్లుప్తంగా

కుమారస్వామికి విశేషపూజలు



శ్రీశైలంటెంపుల్: శ్రీశైల శ్రీభ్రమరాంబామల్లికార్జునస్వామివార్ల ఆలయ ప్రాంగణంలోని కుమారస్వామి ఉపాలయంలో మంగళవారం ఈఓఎస్ లవన్న, అర్చకులు విశేష క్రతువులను నిర్వహించారు. కుమారస్వామికి అభిషేకము, సుబ్రహ్మణ్య, అష్టోత్తరము చేసిన అనంతరం స్తోత్రపారాయణాలు చేశారు. సుబ్రహ్మణ్యస్వామి అభిషేకంలో స్వామివారికి పంచామృతాలు, వివిధ పండ్ల రసాలతో అభిషేక నిర్వహించారు.

చట్టాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి తేజసాయి

ఆత్మకూరు: విద్యార్థులకు చట్టాలపై అవగాహన అవసరమని ఆత్మకూరు జూనియర్ సివిల్ జడ్జి తేజసాయి అన్నారు. పట్టణంలోని స్నేహ స్టడీ సర్కిల్‌లో మంగళవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. విద్యార్థులు మోటర్‌బైక్‌పై వెళ్లేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, యాక్సిడెంట్ జరిగితే అందుకు సంబంధించిన చట్టాలను వివరించారు. మహిళా చట్టాలు, వివిధ చట్టాలపై అవగాహన కల్పించారు. సదస్సులో న్యాయవాదులు శ్రీధర్, మాణిక్యరావు, హుస్సేన్‌మియా, స్టేట్ అకాడమీ డైరెక్టర్ పి.ఆశ తదితరులు పాల్గొన్నారు.

పంట నమోదు జాబితా విడుదల



పంట నమోదు జాబితాను విడుదల చేస్తున్న వ్యవసాయ సిబ్బంది

ఆత్మకూరు: పట్టణంలోని రైతు భరోసా కేంద్రంలో ఈ ఏడాది రబీలో సాగు చేసిన పంటల నమోదు వివరాల జాబితాను మండల వ్యవసాయ అధికారి రవిగౌడ్ మంగళవారం విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ ఆత్మకూరు మండలంలో రబీ సీజన్ కింద పంటలు సాగు చేసిన వివరాల జాబితాను ప్రచురించామని చెప్పారు. ఈ జాబితాలో వివరాలను చూసి ఏమైనా అభ్యంతరాలు ఉంటే రెండు రోజుల్లో తమకు తెలియజేసి సరిచేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి లతమ్మ, కౌలురైతు సంఘం అధ్యక్షుడు అస్రఫ్ అలీ, ఎంపీఈఓ సావిత్రిబాయి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ కార్యాలయంలో వైద్య శిబిరం

నందికొట్కూరు: పట్టణంలోని విద్యుత్ శాఖ కార్యాలయంలో మంగళవారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో విద్యుత్ శాఖలో పని చేసే ఉద్యోగులందరికీ ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. డీఈ శ్రీనివాసులు మాట్లాడుతూ.. మెడికవర్ హాస్పటల్‌కు చెందిన అనుభవజ్ఞులైన వైద్య నిపుణులు పరీక్షలు నిర్వహించి చికిత్సలు అందజేశారన్నారు. అత్యాధునిక వైద్య పరికరాలతో అన్ని రకాల పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు అందజేశారన్నారు. కార్యక్రమంలో విద్యుత్ ఏఈ రాములునాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

అన్నదానం ఎంతో పుణ్యం



కన్నడ భక్తులకు అన్నం వడ్డిస్తున్న మున్సిపల్ చైర్మన్ సుధాకర్‌రెడ్డి

నందికొట్కూరు: కాలినడకన వెళ్లే కన్నడ భక్తులకు అన్నదానం చేయడం ఎంతో పుణ్యమని మున్సిపల్ చైర్మన్ సుధాకర్‌రెడ్డి అన్నారు. భ్రమరాంబా మల్లికార్జునస్వామి వర్ల దర్శనార్థం శ్రీశైల పుణ్య క్షేత్రానికి కాలినడకన వెళ్తున్న కర్ణాటక భక్తులకు పట్టణ శివారులో సీడ్స్ ఫర్టిలైజర్స్, పెస్టిసైడ్స్ డీలర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమాన్ని మంగళవారం మున్సిపల్ చైర్మన్ ప్రారంభించారు. కార్యక్రమంలో ఏడీఏ విజయశేఖర్, ఏఓ శ్రావణి, మున్సిపల్ కో ఆప్షన్ సభ్యులు శ్రీనివాసరెడ్డి, ఎరువుల దుకాణాల అధ్యక్షులు నాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు కుర్వ శ్రీను, శ్రీనివాసగుప్త తదితరులు పాల్గొన్నారు.

21 నుంచి విద్యార్థులకు రాగి జావ

కొత్తపల్లి: మండలంలోని ప్రభుత్వ పాఠశాలలకు రాగిజావా మంజూరైనట్లు మండల విద్యాధికారి శ్రీరాములు మంగళవారం తెలిపారు. మండలంలోని 39 పాఠశాలలకు రాగిజావ ప్యాకెట్లు చేరుకున్నట్లు చెప్పారు. ఈనెల 21వ తేదీ నుంచి అన్ని పాఠశాలలో విద్యార్థులకు రాగిజావాను పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు. ప్రభుత్వ పాఠశాలలో ఇదివరకే ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకంలో ఎన్నో మార్పులు చేసి రుచికరమైన, నాణ్యమైన అహారాన్ని అందిస్తోందన్నారు. అదేతరహాలో విద్యార్థులు ఆరోగ్యం ఉండేలా రాగిజావాను కూడా పంపిణీ చేస్తుందని చెప్పారు.

చల్లని పండు.. పెరుగుతున్న డిమాండు

- ఎండలు పెరగడంతో ఊపందుకున్న పుచ్చకాయల విక్రయాలు
- రోడ్ల వెంట తాత్కాలిక దుణాకాల ఏర్పాటు
- రోజుకు రూ.లక్ష దాకా వ్యాపారం



నందికొట్కూరు పాత బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన పుచ్చకాయల మండీ



పుచ్చకాయ కోసి విక్రయిస్తున్న వ్యాపారి

నందికొట్కూరు: మార్చి నెలలోనే ఎండలు విపరీతంగా పెరుగుతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ చల్లదనాన్ని కోరుకుంటున్నారు. ముఖ్యంగా ఎండల్లో ప్రయాణించే వారు దాహార్తిని తీర్చుకునే ప్రయత్నం చేస్తున్నారు. మండుటెండలో ఓ కళింగర ముక్క తింటే దాహార్తికి అడ్డుకట్ట వేయవచ్చని వీటికే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారు. రుచికి రుచి.. చల్లదనానికి చల్లదనం ఇస్తుండటంతో పుచ్చకాయ అంటే చిన్నారుల నుంచి వృద్ధుల వరకూ ఇష్టంగా ఆరగిస్తున్నారు. దీంతో పుచ్చకాయ అమ్మకాలు ఊపందుకున్నాయి. ప్రస్తుతం రహదారుల వెంట వ్యాపారులు తాత్కాలిక దుకాణాలు, తోపుడు బండ్లతో పుచ్చకాయలను విక్రయిస్తున్నారు.

భారీగా విక్రయాలు

నందికొట్కూరు పట్టణంలో మూడు పెద్ద మండీలను ఏర్పాటు చేసి పెద్ద మొత్తంలో హోల్‌సెల్‌గా పుచ్చకాయల వ్యాపారం సాగిస్తున్నారు. ఇక్కడి నుంచి చుట్టు పక్కల మండలాలకు సరఫరా చేస్తున్నారు. పుచ్చకాయలను ఎక్కువగా చెన్నై, పుదిచ్చేరి నుంచి తీసుకువస్తున్నట్లు వ్యాపారులు పేర్కొంటున్నారు. అంతే కాకుండా పట్టణంలో చిన్న చిన్న దుకాణాల్లో పుచ్చకాయలు రీటైల్‌గా విక్రయిస్తున్నారు. వీటితో పాటు దాదాపు 15 తోపుడు బండ్ల ద్వారా రహదారుల వెంట పుచ్చకాయలు, ముక్కలుగా కోసిన పండ్లు విక్రయిస్తున్నారు. వీటి ద్వారా రోజుకు రూ.లక్ష వ్యాపారం జరుగుతున్నట్లు వ్యాపారులు చెబుతున్నారు. పట్టణంలో గత 20 రోజుల్లో ఆరు లోడ్ల పుచ్చకాయలు అమ్మినట్లు వెల్లడించారు.

సైజును బట్టి రేటు

రీటైల్‌గా పుచ్చకాయల సైజును బట్టి ధర కట్టి విక్రయిస్తున్నారు. ఒక్కో కాయ సైజును బట్టి రూ.100, రూ.150, రూ.200 చొప్పున అమ్ముతున్నారు. మరీ చిన్నవైతే కాస్త తక్కువ ధరకు ఇచ్చేస్తున్నారు. పండు ఒప్పలైతే (పుచ్చకాయ ముక్క) రూ.10ల చొప్పున ఇస్తున్నారు.

ఆరోగ్యానికి మంచిది

పుచ్చకాయలో 82 శాతం నీరు ఉండటంతో ఇది శరీరానికి కావాల్సిన చల్లదనాన్ని ఇస్తుంది. పుచ్చకాయలో పోషకాలు కూడా ఎక్కువగా ఉంటాయి. చిన్న పిల్లలు ఎక్కువగా తింటే జ్ఞాపకశక్తి, రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. పుచ్చకాయ తింటే రక్తపోటు, కొలెస్టరాల్ కూడా తగ్గుతుంది. పుచ్చకాయలో ఉండే మెగ్నీషియం, పొటాషియం గుండె ఆరోగ్యానికి తోడ్పడతాయి. వేసవిలో పుచ్చకాయ తినడం ఆరోగ్యానికి మంచిది.

– డాక్టర్ ఏఎస్ రాయుడు, నందికొట్కూరు

ఇష్టంగా తింటున్నారు



ఎండలు బాగా ముదరడంతో రోజుకు ఒక సారి పుచ్చకాయ తినడంతో దాహం తీరుతుంది. దీంతోపాటు వేడి తగ్గుతుంది. చల్లగా తీయగా ఉండటంతో పిల్లలు, పెద్దలు ఇష్టంగా తింటున్నారు.

– భూషన్న

వ్యాపారం ఊపందుకుంది

పట్టణంలోని పాతబస్టాండ్‌లో మండీ ఏర్పాటు చేసి పుచ్చకాయలు విక్రయిస్తున్నా. ఎండలు పెరుగుతుండటంతో పుచ్చకాయల వ్యాపారం ఊపందుకుంది. లోపల ఎర్రగా ఉండే పండ్లను అందరూ ఇష్టంగా కొంటున్నారు. ఒక్కో పండు రూ.100 నుంచి రూ.200 దాకా విక్రయిస్తున్నా రోజుకు రూ.20వేల దాకా వ్యాపారం జరుగుతోంది.

– శ్రీనివాసులు, పుచ్చకాయల వ్యాపారి

నేటి నుంచి ఇంటర్మీడియెట్ పరీక్షలు

నందికొట్కూరు: ఇంటర్మీడియెట్ ఫస్ట్, సెకండ్ ఇరియర్ పబ్లిక్ పరీక్షలు పట్టణంలోని నాలుగు కేంద్రాల్లో బుధవారం నుంచి నిర్వహించనున్నారు. ఇందుకు పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, బసిరెడ్డి, నంది, విజ్ఞాన్, నంది కళాశాలలో అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఫస్ట్ ఇరియర్–408, సెకండ్ ఇరియర్–392, బసిరెడ్డిలో ఫస్ట్ ఇరియర్–173, సెకండ్ ఇరియర్–232, విజ్ఞానలో ఫస్ట్ ఇరియర్–316, సెకండ్ ఇరియర్–287, నందిలో ఫస్ట్ ఇరయర్–169, సెకండ్ ఇరియర్–206 మంది పరీక్షలు రాస్తునట్లు అధికారులు తెలిపారు.

ఇంటర్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

మిడుతూరు: ఇంటర్మీడియెట్ పరీక్షలకు సీసీ కెమెరాల పర్యవేక్షణలో పకడ్బందీగా ఏర్పాట్లు చేసినట్లు పరీక్షల నిర్వహణ అధికారి, ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ సలీంబాషా తెలిపారు. మంగళవారం స్థానిక ఆదర్శ పాఠశాలలో పాత్రికేయులతో సమావేశం నిర్వహించారు. ఈ నెల 15 నుంచి 29వ తేదీ వరకు పరీక్షలు జరుగుతాయని చెప్పారు. విద్యార్థులు పరీక్షా కేంద్రానికి ఉదయం 8.30 గంటలకు చేరుకోవాలని, 9 గంటల తర్వాత ఒక్క నిమిషం ఆలస్యమైనా లోపలికి అనుమతించమని స్పష్టం చేశారు. పరీక్షా కేంద్రానికి ఎలక్ట్రిక్ పరికరాలు, సెల్‌ఫోన్‌లు తదితర వస్తువులు అనుమతించమన్నారు.

21న మున్సిపల్ వేలం పాటలు

ఆత్మకూరు: ఆత్మకూరు మున్సిపాలిటీ పరిధిలో ఈ నెల 21వ తేదీన వేలం పాటలు నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ వారపు సంతకు రూ.4లక్షలు, దినసరి కూలీల మార్కెట్ రూ.4లక్షలు, బస్టాండ్ ఫీజులు రూ.7లక్షలు, చిన్నకమేలా రూ.లక్షన్నర, పెద్దకమేలా రూ.50 వేలు, చేపలు, చికెన్ సెంటర్లు రూ.లక్ష చొప్పున ధరావత్తు, వ్యక్తిగత పూచికత్తులకు రుసుము చెల్లించి వేలంపాటలో పాల్గొనాలన్నారు.

ఒంటిపూట బడులు నిర్వహించాలి

ఆత్మకూరు: రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు అధికమవుతున్నందున అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, జూనియర్ కళాశాలలకు ఒంటి పూట బడులు నిర్వహించాలని గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు జవహర్‌నాయక్ కోరారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ విద్యార్థులు ఎండ అధికంగా ఉండడం వలన అస్వస్థతకు గురయ్యే అవకాశం ఉందన్నారు. వడదెబ్బతగిలే ప్రమాదం ఉందని, ఇందువలన అధికారులు స్పందించి ఒంటి పూట బడులు ప్రారంభించాలన్నారు. ఇందుకు సంబంధించిన జిల్లా విద్యాధికారులు ఆదేశాలు జారీ చేయాలని కోరారు.

నులిపురుగు నివారణకు ఆల్బెండజోల్



పాములపాడు జెడ్పీహెచ్‌ఎస్‌లో పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు వేస్తున్న దృశ్యం

పాములపాడు: పిల్లల్లో నులి పురుగుల నివారణకే ఆల్బెండజోల్ మాత్రలు ఇస్తున్నట్లు డాక్టర్ నాగలక్ష్మి, ఎంఈఓ బాలాజీనాయక్ తెలిపారు. మంగళవారం నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాలు, అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులతో ఆల్బెండజోల్ మాత్రలు మింగించారు. వారు మాట్లాడుతూ 18 సంవత్సరాల్లోపు పిల్లలందరికి తప్పనిసరిగా వేయించాలన్నారు. నులిపురుగులు ఉండటం వల్ల పిల్లల్లో రక్తహీనత వస్తుందన్నారు.

పిల్లలకు మాత్రలు తప్పనిసరిగా వేయించాలి..

ఆత్మకూరు: నులిపురుగుల నివారణకు పిల్లలకు తప్పనిసరిగా ఆల్బెండజోల్ మాత్రలను వేయించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ఆసియామారూఫ్ అన్నారు. పట్టణంలోని వెంగళరెడ్డినగర్ అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు వేయించారు. మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు, వైద్యాధికారి మహబూబ్‌బేగ్, ధనలక్ష్మి, సుబ్బలక్ష్మి పాల్గొన్నారు.

జూపాడుబంగ్లా: మండలంలోని జూపాడుబంగ్లా, పారుమంచాల ఆరోగ్యకేంద్రాల పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలల్లో వైద్యులు డాక్టర్ గంగాధర్, డాక్టర్ సభా, డాక్టర్ మౌనిక, డాక్టర్ యశస్విని ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ మోహన్, ప్రిన్సిపాల్ రమేష్, సీహెచ్ఓ వహాబ్ పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలందించాలి



బాలింతకు అందుతున్న సేవలపై ఆరా తీస్తున్న నంద్యాల డీసీహెచ్ఎస్ డాక్టర్ జఫరుల్లా

మిడుతూరు: ఆసుపత్రికి వచ్చే రోగులను ఆత్మీయ పలకరింపుతో పాటు మెరుగైన వైద్య సేవలు అందించాలని నంద్యాల జిల్లా డీసీహెచ్ఎస్ (డిస్ట్రిక్ కో–ఆర్డినేటర్ హాస్పిటల్ సర్వీసెస్) డాక్టర్ జఫరుల్లా అన్నారు. మంగళవారం స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో 100 డెలివరీలు, 300 కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు పూర్తయిన సందర్భంగా సామాజిక ఆరోగ్యకేంద్రంలో కేక్‌కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఆయన మాట్లాడుతూ హాస్పిటల్‌కు డెలివరీలకు వచ్చే రోగులకు సాధారణ కాన్పులు చేయడంతో పాటు ప్రభుత్వం నుంచి వచ్చే ప్రోత్సాహకాలను అందించాలని చెప్పారు. ఆశా కార్యకర్తలు సెల్‌ఫోన్ నంబర్లు పెట్టుకొని గర్భిణుల ఆరోగ్యం, యోగ, క్షేమాలను ఎప్పటికప్పుడు అడిగి తెలుసుకోవాలని సూచించారు. కాన్పుల సంఖ్య పెంచడంతోపాటు మాతాశిశుమరణాల రేటు తగ్గించేందుకు కృషి చేయాలన్నారు. నందికొట్కూరు, మిడుతూరు సీహెచ్‌సీ డాక్టర్లు సమన్వయంతో హై రిస్క్(సిజెరిన్), ఆపరేషన్లు చేసేందుకు కృషి చేయాలని సూచించారు. హాస్పిటల్‌లో అందే సేవలపై రోగులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మిడుతూరు, నందికొట్కూరు సీహెచ్‌సీ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో నందికొట్కూరు మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రాయుడు, గైనకాలజిస్టు డాక్టర్ సుగుణ, చిన్న పిల్లల వైద్యులు డాక్టర్ తిరుపతి, డాక్టర్ ప్రసాద్ నాయక్, అనస్థీషియా డాక్టర్ శారద, డెంటిస్టు వీణా, వైద్యులు వంశీకృష్ణ, సుజాత తదితరులు పాల్గొన్నారు.

ఉగాది నాటికి నిర్మాణాలు పూర్తి చేసుకోవాలి



ఇంటి నిర్మాణాలను పరిశీలిస్తున్న డీఈ ప్రభాకర్

మిడుతూరు: ఉగాది పర్వదినం నాటికి ఇంటి నిర్మాణాలు పూర్తి చేసుకోవాలని హౌసింగ్ డీఈ ప్రభాకర్ సూచించారు. మంగళవారం మండల పరిధిలోని కలమందలపాడు, కడుమూరు గ్రామాల్లోని జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలు అధిగమించాలన్నారు. వివిధ దశల్లో ఉన్న నిర్మాణాలను పరిశీలించి ఉగాది నాటికి పూర్తి చేసుకునేలా లబ్ధిదారులను ప్రోత్సహించాలని వర్క్ ఇన్‌స్పెక్టర్లను ఆదేశించారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ రమేష్, తదితరులు పాల్గొన్నారు.

వేగవంతం చేయాలి

పగిద్యాల: నవరత్నాలు –పేదలందరికి ఇళ్లు పథకంలో భాగంగా మండల వ్యాప్తంగా జగనన్న ఆదర్శ కాలనీలలో లబ్ధిదారులు చేపట్టిన ఇంటి నిర్మాణాలు వేగవంతం చేసి ఉగాది నాటికి తప్పనిసరిగా పూర్తి చేసుకోవాలని ఎంపీడీఓ వెంకటరమణ సూచించారు. మంగళవారం స్థానిక జగనన్న ఆదర్శ కాలనీలో ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. ఈఓఆర్డీ పుల్లయ్య, ఇంజనీరింగ్ అసిస్టెంట్ కార్తీక్ తదితర సిబ్బంది ఉన్నారు.

చికిత్స కన్నా నివారణే మేలు

పాములపాడు: వ్యాధి సోకిన తరువాత చికిత్స చేయించుకునే కన్నా నివారణకు టీకాలు వేయించడం ఎంతో మంచిదని పశు వైద్యాధికారి భాస్కర్ అన్నారు. మంగళవారం మండలంలోని వేంపెంట పశువైద్య కేంద్రం పరిధిలోని యర్రగూడూరు గ్రామంలో పశువులకు ఉచితంగా గాలికుంటు నివారణ టీకాలు వేశారు. ఆయన మాట్లాడుతూ పాడి రైతులు గేదెలు, ఎద్దులు, లేగదూడలకు తప్పనిసరిగా టీకాలు వేయించాలని సూచించారు. గాలి కుంటు వ్యాధి సోకితే కనిపించే లక్షణాలు, జరిగే నష్టాల గురించి వివరించారు.

ప్రకృతి వ్యవసాయంతో దిగుబడులు మెండు



రైతులకు జీవామృతం తయారీని వివరిస్తున్న దృశ్యం

కొత్తపల్లి: పంటల సాగులో ప్రకృతి వ్యవసాయ పద్ధతులతో మెండైన దిగుబడులను పొందవచ్చునని ప్రకృతి వ్యవసాయ విభాగం ఇన్‌చార్జ్ సయ్యద్ బాషా తెలిపారు. మంగళవారం శివపురం పరిధిలోని రైతుల పొలాల్లో ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గ్రామానికి చెందిన రైతు తలారి లింగన్న మూడు ఎకరాల మునగ పంటను, దీంతో పాటు అంతర పంటలైన చిక్కుడు, వంగ పంటలను సాగు చేసుకున్నారు. ఈ పంటలలో ప్రకృతివ్యవసాయ పద్ధతిలో జీవామృతం, నేమాస్త్రం (వేప కషాయం) తయారీ విధానం వివరించి, అక్కడే వాటిని తయారు చేసి రైతులకు చూపించారు. వీటి వాడుకవిధానంను రైతులకు క్షుణ్ణంగా వివరించారు. కార్యక్రమంలో ఆర్‌బీకే వీఏఏ మౌనిక, ప్రకృతి వ్యవసాయ విభాగం సిబ్బంది వెంకటేష్, సుమలత పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాలలో త్రిసభ్య కమిటీ తనిఖీ



స్టోర్ రూమ్‌లో స్టాక్‌ను పరిశీలిస్తున్న అధికారులు

పగిద్యాల: స్థానిక ఆదర్శ పాఠశాలలో మధ్యాహ్న భోజనం పథకం నిర్వహణపై మంగళవారం త్రిసభ్య కమిటీ సభ్యులు తహసీల్దార్ భారతి, ఎంపీడీఓ వెంకటరమణ, ఎంఈఓ సుభాన్‌లు తనిఖీ నిర్వహించారు. పాఠశాలలో 376 మంది విద్యార్థులు హాజరు కాగా 320 మంది విద్యార్థులు మధ్యాహ్న భోజనం తిన్నట్లు సభ్యులు గుర్తించారు. బియ్యం ఎన్ని కిలోలు వేశారని వంట నిర్వాహకులను కమిటీ సభ్యులు ప్రశ్నించారు. దీంతో వారి నుంచి ఎలాంటి సమాధానం రాలేదు. జగనన్న గోరు ముద్ద ఆహార పట్టిక మెనూ ప్రకారం రుచి, శుచిని పాటిస్తూ పౌష్టికాహారం అందించాలని, పులిహోర సరిగా చేయలేదని వంట నిర్వాహకులపై మండిపడ్డారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కారాదని క్రమశిక్షణ చర్యల నిమిత్తం వంట నిర్వాహకురాలికి నోటీసులు జారీ చేశారు. అనంతరం స్టోర్ రూమ్‌లో నిల్వ చేసిన బియ్యం, కోడి గుడ్లు, జగనన్న చిక్కీల స్టాక్‌ను పరిశీలించి ప్రిన్సిపాల్‌కు పలు సూచనలు చేశారు. వారి వెంట ఈఓఆర్డీ పుల్లయ్య, వీఆర్వో నాగన్న, సీఆర్‌పీలు తదితరులు ఉన్నారు.

అమ్మవారికి కొబ్బరికాయల సమర్పణ



అమ్మవారికి కొబ్బరికాయలను తీసుకువెళ్తున్న దేవస్థానం ఉద్యోగి

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం ఆధ్వర్యంలో మంగళవారం భ్రమరాంబా అమ్మవారికి కొబ్బరి కాయలు సమర్పించారు. చైత్రమాసంలో పౌర్ణమి తర్వాత వచ్చే మంగళవారం, శుక్రవారం ఏ రోజు ముందు వస్తే ఆ రోజు శ్రీశైల శ్రీభ్రమరాంబాదేవికి కుంభోత్సవ జరపడం సంప్రదాయం. ఈ ఏడాది ఏప్రిల్ 11న అమ్మవారికి కుంభోత్సవం నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా అమ్మవారికి కొబ్బరి కాయలు సమర్పించారు. కార్యక్రమంలో ముందుగా అమ్మవారి ఆలయ ప్రదక్షిణ మండపంలో కొబ్బరికాయలను రాశిగా పోసి పసుపు, కుంకుమలతో పూజాధికాలు జరిపించారు.

ఎమ్మార్పీ కంటే ఎక్కువకు విక్రయించరాదు



దుకాణదారులతో సమావేశమైన సీఐ, ఎస్సైలు

శ్రీశైలం: ఉగాది ఉత్సవాలను పురస్కరించుకొని శ్రీశైల క్షేత్రంలో ఏ వస్తువయినా ఎమ్మార్పీ కంటే ఎక్కువకు విక్రయించరాదని సీఐ దివాకర్‌రెడ్డి దుకాణదారులకు సూచించారు. శ్రీశైలమహాక్షేత్రంలో ఈ నెల 19 నుంచి ఉగాది ఉత్సవాలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో గతంలో జరిగిన ఘటనలు దృష్టిలో ఉంచుకుని మంగళవారం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో స్థానిక దుకాణదారులతో వన్‌టౌన్, టూ టౌన్ ఎస్సైలతో కలిసి సమావేశం నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ.. గతేడాది వాటర్‌బాటిల్ ధర అధికంగా విక్రయించడం వలన కన్నడిగులకు, స్థానికులకు మధ్య వివాదం నెలకొని విధ్వంసానికి దారి తీసిందని గుర్తు చేశారు. ఇలాంటి విషయాలు పునరావృతం కాకుండా కచ్చితంగా ఎమ్మార్పీలకు మాత్రమే ప్రతి వస్తువును విక్రయించాలని స్పష్టం చేశారు. వస్తువుపై ఎమ్మార్పీతో పాటు బ్యాచ్ నంబర్, ఎక్స్‌పైరీ డేట్, మ్యానిఫ్యాక్చరింగ్ డేట్ మొదలైనవి ఉండేలా చూసుకోవాలని చెప్పారు. అలాగే కర్ణాటక, మహారాష్ట్రల నుంచి లక్షల సంఖ్యలో ఉగాది ఉత్సవాలకు తరలివచ్చే భక్తులకు దుకాణదారులు సహనంతో వ్యవహరించి, విక్రయాలు సాగించాలని సూచించారు. ఈ ఏడాది బందోబస్తుకు కర్ణాటక పోలీసుల సహకారం కూడా తీసుకుంటున్నామని, నైట్ పెట్రోలింగ్ కూడా మెరుగైన పద్ధతిలో నిర్వహించేలా చర్యలు తీసుకున్నామని వివరించారు. ఏ దుకాణం వద్ద అయినా గొడవ జరిగే అవకాశం ఉన్నట్లు అనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందజేస్తే ప్రత్యేక విధులపై వచ్చిన పోలీసులను పంపి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా నిరోధిస్తామని చెప్పారు.

మద్దతు ధరతో జొన్నల కొనుగోలు

గోస్పాడు: మద్దతు ధరతో ప్రభుత్వమే జొన్నలు కొనుగోలు చేస్తోందని మండల వ్యవసాయాధికారి అబ్దుల్ హక్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ క్వింటా రూ.2,970 చొప్పున మండలంలో 1,830 మెట్రిక్ టన్నుల జొన్నలను కొనుగోలు చేసే లక్ష్యంతో ఉన్నామన్నారు. జూలేపల్లె, పసురపాడు, ఎం.కృష్ణాపురం, గోస్పాడు, యాళ్లూరు, ఒంటివెలగలలో కొనుగోళ్లను ప్రారంభించి ఇప్పటికే 435 మెట్రిక్ టన్నుల జొన్నలను కొనుగోలు చేసినట్లు తెలిపారు. లోడింగ్, అన్‌లోడింగ్ హమాలీ ప్రాసెసింగ్ చార్జీలకు క్వింటాకు మరో రూ.22 ఇస్తున్నట్లు చెప్పారు. రవాణా, సంచుల ఖర్చులు కూడా ప్రభుత్వమే భరిస్తుందన్నారు.

కలెక్టర్ ఆదేశాలు బేఖాతరు

నంద్యాల(సిటీ): జిల్లా కలెక్టర్ ఆదేశాలను మున్సిపల్ అధికారులు గాలికొదిలేశారు. ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని 15 రోజుల క్రితమే చలివేంద్రాలు, చలువ పందిళ్లు ఏర్పాటు చేయాలని కలెక్టర్ మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డిని ఆదేశించారు. అయినా నగరంలో ఇప్పటికీ ఒక్కటి కూడా ఏర్పాటు చేయలేదు. అసలే ఎండలు మండిపోతున్నాయి. వివిధ పనులపై జిల్లా కేంద్రానికి వచ్చే ప్రజలు దాహంతో అల్లాడుతున్నారు. ఇప్పటికైనా త్వరగా చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు. అలాగే ప్రధాన కూడళ్లలో సిగ్నల్స్ పడినప్పుడు ఎండకు వేచి ఉండలేకపోతున్నామని చలువ పందిళ్లు వేయాలని వాహనదారులు కోరుతున్నారు.

వైభవంగా అష్టాదళ పాద పద్మారాధన



అష్టాదళ పాద పద్మారాధన సేవలో అమ్మవారు

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని గాంధీచౌక్‌లో వెలసిన శ్రీకాళికాంబ చంద్రశేఖర దేవస్థానంలో మంగళవారం అమ్మవారికి అష్టాదళ పాద పద్మారాధన సేవ వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజామునే అమ్మవారి మూలవిరాట్‌కు సుప్రభాతసేవ, పంచామృతాభిషేకాలు, వివిధ రకాల పండ్ల రసాలతో అభిషేకం నిర్వహించారు. అనంతరం 108 వెండి పుష్పాలచే అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమం చేపట్టారు. అనంతరం అమ్మవారికి చీర, ఒడి బియ్యం సమర్పించి మహామంగళ హారతులు ఇచ్చి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఈఓ లక్ష్మీనారాయణ, అర్చకులు రాఘవేంద్రాచారి, సుబ్బాచారి, ఆరవేటి వాసు, విజయకుమార్, నరసింహ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో బావబామ్మర్ది మృతి



మృతి చెందిన పులి వెంకటేశ్వర్లు

కర్నూలు (న్యూటౌన్): కర్నూలు మండలం వెంకాయపల్లె రోడ్డులోని ఎస్ఎస్ గార్డెన్ ఎదురుగా మంగళవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో నందికొట్కూరు నియోజకవర్గ పరిధిలోని కొణిదెల గ్రామానికి చెందిన తోడేలు మల్లికార్జున (30), పులి వెంకటేశ్వర్లు (28) ఇద్దరు మృతి చెందారు. కొణిదెల గ్రామానికి చెందిన పాండు కుమారుడు మల్లికార్జున బట్టల షాపులో గుమస్తాగా పనిచేసేవాడు. అదే గ్రామానికి చెందిన పెండయ్య కుమారుడు వెంకటేశ్వర్లు జేసీబీ డ్రైవర్‌గా పని చేస్తున్నారు. వీరివురు వరుసకు బావాబామర్దులు. బంధువులు వెంకాయపల్లె ఎల్లమ్మతల్లి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేస్తుండడంతో హాజరయ్యారు. అనంతరం కొణిదెలకు తిరిగి వెళ్తుండగా ఐషర్ వాహనాన్ని ఢీకొట్టారు. గాయపడిన వీరివురిని కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందారు. తోడేలు మల్లికార్జునకు భార్య, ఓ కుమారుడు సంతానం. పులి వెంకటేశ్వర్లుకు భార్య, కుమారుడు, కుమార్తె సంతానం. సంఘటన స్థలానికి చేరుకున్న కర్నూలు అర్బన్ తాలుకా పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కంటి చూపును చంపే వ్యాధి గ్లకోమా



సీతారామాపురంలో కంటి పరీక్షలు చేస్తున్న డాక్టర్ కృష్ణమోహన్‌రెడ్డి

మహానంది: కంటిలో నీటి ఒత్తిడి పెరగడం ద్వారా కంటిలో నరాలు దెబ్బతిని క్రమంగా అంధత్వం కలిగించే వ్యాధిని గ్లకోమా లేక నీటికాసులు అంటారని కంటి వెలుగు ప్రోగ్రాం వైద్యాధికారి కృష్ణమోహన్ రెడ్డి తెలిపారు. డాక్టర్ వైఎస్సార్ కంటివెలుగు కార్యక్రమంలో భాగంగా మంగళవారం సీతారామాపురం గ్రామంలో కంటివైద్యపరీక్షలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ తలనొప్పి, కంటిలో నొప్పి, దృష్టిలోపాలు, దురదలు, నీళ్లు కారడం లాంటి లక్షణాలు తరచూ కనిపిస్తే వెంటనే కంటివైద్యులను సంప్రదించి పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఆకుపచ్చని కూరగాయలు, పండ్లు, పోషక విలువలు కలిగిన ఆహారాన్ని ఎక్కువగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వరప్రసాద్, కిషోర్‌గుప్త, సీహెచ్ఓ సుజాత, ఏఎన్ఎం బాలమ్మ, ఆశా కార్యకర్తలు సుజాత, రాణి పాల్గొన్నారు.

మహానందిలో కన్నడిగుల రద్దీ



ఆలయ ప్రాంగణంలో భక్తుల సందడి

మహానంది: ఉగాది పర్వదినం సమీపిస్తుండటంతో మహానంది ఆలయ ప్రాంగణాలు కన్నడ భక్తులతో కళకళలాడుతున్నాయి. వేలాది సంఖ్యలో కన్నడిగుల రాకతో ఆలయ పరిసరాల్లో సందడి నెలకొంది. మంగళవారం రెండు తెలుగురాష్ట్రాల భక్తులతో పాటు కర్ణాటక రాష్ట్ర భక్తులు క్షేత్రానికి తరలివచ్చారు. ఆలయానికి వచ్చిన భక్తులు స్థానిక కోనేరులలో పుణ్యస్నానాలు ఆచరించి శ్రీ కామేశ్వరీదేవి, మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేపట్టారు. ఉదయం నుంచి మధ్యాహ్నం, మధ్యాహ్నం రెండు గంటల నుంచి రాత్రి ఏకాంత సేవ పూజల వరకు దర్శనం కొనసాగింది.